సాక్షి పశ్చిమగోదావరి

శనివారం । 30 । మార్చి । 2024



బ్రహ్మాస్త్రం.. సీ విజిల్

సార్వత్రిక ఎన్నికల్లో అక్రమాల నిరోధానికి ప్రజలు పాలనా యంత్రాంగాన్ని అప్రమత్తం చేసేలా ఎన్నికల సంఘం సీ-విజిల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. IIలో ▸



భారీగా నగదు పట్టివేత

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఎన్నికల అధికారులు, టాస్క్‌ఫోర్స్ బృందాలు నిర్వహించిన తనిఖీల్లో శుక్రవారం పెద్ద ఎత్తున నగదు పట్టుకున్నారు. IIలో ▸

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ శనివారం (సాయంత్రం)	సహరి ఆదివారం (ఉదయం)
భీమవరం	6.23	4.41
ఏలూరు	6.25	4.38

న్యూస్‌రీల్

హైకోర్టు న్యాయమూర్తికి ఘన స్వాగతం



హైకోర్టు న్యాయమూర్తి కృష్ణమోహన్‌కు పూలమొక్కను అందిస్తున్న దృశ్యం

ఏలూరు (టూటౌన్): హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్ శుక్రవారం రాత్రి ఏలూరు విచ్చేశారు. శనివారం ఏలూరు కలెక్టరేట్‌లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయమూర్తులతో జరుగనున్న జ్యూడీషియల్ సదస్సులో ఆయన పాల్గొంటారు. హైకోర్టు న్యాయమూర్తి కృష్ణమోహన్‌కు జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్, జిల్లా అదనపు ఎస్పీ స్వరూపరాణి, ఏలూరు ఆర్డీఓ ఎన్ఎస్‌కే ఖాజావలి, అధికారులు ఘన స్వాగతం పలికారు.

33 శాఖల సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్



కలెక్టర్ సుమిత్‌కుమార్

భీమవరం (ప్రకాశం చౌక్): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల విధుల్లో ఉంటూ పోలింగ్ రోజు ఓటు వేయలేని 33 నిత్యావసర సేవల శాఖల సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ అవకాశాన్ని కల్పించినట్టు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్‌కుమార్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ప్రత్యేకంగా నోడల్ అధికారిని నియమించడంతో పాటు పోస్టల్ బ్యాలెట్‌కి సంబంధించి ఫారం -12డీలను అందుబాటులో ఉంచనున్నట్టు పేర్కొన్నారు. మెట్రో, రైల్వే రవాణా సేవలు, మీడియా వ్యక్తులు, విద్యుత్ శాఖ, బీఎస్ఎన్ఎల్, పోస్టల్ టెలిగ్రామ్, దూరదర్శన్, ఆలిండియా రేడియో, రాష్ట్ర మిల్క్ యూనియన్, మిల్క్ కో-ఆపరేటివ్ సొసైటీలు, ఆరోగ్య శాఖ, ఎఫ్‌సీఐ, విమానయానం, రోడ్డు రవాణా సంస్థ, అగ్నిమాపక సేవలు, ట్రాఫిక్ పోలీస్, అంబులెన్స్ సేవలు, షిప్పింగ్, ఫైర్ ఫోర్స్, జైళ్లు, ఎక్సైజ్ శాఖ, వాటర్ అథారిటీ, ట్రెజరీ సర్వీస్, అటవీ శాఖ, సమాచార, ప్రజాసంబంధాల శాఖ, పోలీసు, పౌర రక్షణ- హోంగార్డులు, ఆహార పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాలు, ఎనర్జీ, ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా, ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో, డిపార్ట్‌మెంట్ ఆఫ్ పీడబ్ల్యూడీ, నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్స్, విపత్తు నిర్వహణలో విధులు నిర్వహించే సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ అవకాశం కల్పించినట్టు వివరించారు.

పన్ను బకాయిలపై వడ్డీ రాయితీ

భీమవరం(ప్రకాశం చౌక్): రాష్ట్ర ప్రభుత్వం పన్ను బకాయిలను ఒకేసారి చెల్లించిన వారికి కల్పించిన వడ్డీ రాయితీ గడువు నెలాఖరు (ఈ నెల 31) వరకు ఉందని భీమవరం మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామల తెలిపారు. బకాయిలు ఏకమొత్తంగా చెల్లించిన వారికి ప్రభుత్వం వడ్డీ రాయితీ ప్రకటించిందని, ప్రజలు ఆస్తి, ఖాళీ స్థల పన్నులు పూర్తిగా చెల్లించి రాయితీ పొందాలని సూచించారు. ఆఖరి రోజు సర్వర్ సమస్యలు తలెత్తే అవకాశం ఉందని, ముందుగానే చెల్లింపులు చేయాలని కోరారు. ఏప్రిల్ 1 నుంచి యథావిధిగా వడ్డీ జమవుతుందన్నారు. పన్ను చెల్లింపులకు వీలుగా సెలవు రోజుల్లో కూడా భీమవరం మున్సిపల్ కార్యాలయంలోని పురసేవ కౌంటర్ నడుస్తుందన్నారు. అలాగే ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు వార్డు సచివాలయాల్లో కూడా పన్నులు చెల్లించవచ్చన్నారు. ఆస్తి పన్ను, నీటి పన్ను, ఖాళీ స్థలం పన్ను, నీటి మీటర్ చార్జీలు, డీ అండ్ ట్రేడ్ లైసెన్స్ ఫీజులు చెల్లించవచ్చని తెలిపారు.

ఎన్నికల నియమావళిపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ లక్ష్మయ్య

పెదపాడు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రతిఒక్కరూ ఎన్నికల నియమావళిని తప్పక పాటించాలని ఏలూరు డీఎస్పీ లక్ష్మయ్య సూచించారు. పెదపాడులో శుక్రవారం గ్రామస్తులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో 18 ఏళ్లలోపు వారిని వినియోగించరాదన్నారు. ప్రతిఒక్కరూ రూ.50 వేలకు మించి నగదును తమ ప్రయాణ సమయంలో వెంట పెట్టుకుని వెళ్లరాదన్నారు. రాజకీయ చిహ్నాలు, రాజకీయ జెండాలు వాహనాలపై కలిగి ఉండరాదని, అలా కలిగి ఉండాలంటే ఆన్‌లైన్‌లో సువిధ యాప్ ద్వారా ముందుగా అనుమతులు పొందాలని అన్నారు.

భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే



పెంటపాడు: తాడేపల్లిగూడెంలో ఆర్‌సీఎం చర్చి ఆధ్వర్యంలో శిలువ యాత్ర చేస్తున్న విశ్వాసులు

లోకరక్షకుడు క్రీస్తు త్యాగానికి ప్రతీకగా జిల్లావ్యాప్తంగా క్రైస్తవ విశ్వాసులు గుడ్‌ఫ్రైడేను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. క్రైస్తవ మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేసి క్రీస్తు గీతాలు ఆలపించారు. పట్టణాలు, గ్రామాల్లో పరిశుద్ధ శిలువ యాత్రలతో ర్యాలీలు నిర్వహించారు.

\- సాక్షి నెట్‌వర్క్



భీమవరం (ప్రకాశం చౌక్) : భీమవరంలో క్రైస్తవ గీతాలు ఆలపిస్తున్న దృశ్యం



తణుకు టౌన్ : వేల్పూరులో ప్రార్థనలు చేస్తున్న విశ్వాసులు

పేదింటికి ఫ్యామిలీ డాక్టర్

సీఎం జగన్‌కు నా దీవెనలు



ఈమె పేరు బలగం సీతమ్మ. నరసాపురం మండలం వేములదీవి ఈస్ట్ గ్రామం. 70 ఏళ్ల వయస్సులో సీతమ్మ కాళ్ల నొప్పులు, ఆయాసం, షుగర్, బీపీతో బాధపడుతున్నారు. కాళ్ల నొప్పులు ఎక్కువగా ఉండటంతో ఆస్పత్రి వరకు వెళ్లలేని పరిస్థితి. ప్రతి నెలా రెండో సోమవారం డాక్టర్‌తో కలిసి వైఎస్సార్ హెల్త్ క్లినిక్ సిబ్బంది ఆమె ఇంటికి వెళ్లి పరీక్షలు చేసి నెలకు సరిపడా మందులు ఇస్తున్నారు. నాలాంటి ముసలి వాళ్లకు అంతకన్నా కావాల్సిందేముంది.. సీఎం జగన్ చలువ వల్లే ఇవన్నీ జరుగుతున్నాయి. ఆ బాబుకు నా దీవెనలు ఎల్లప్పుడూ ఉంటాయని సీతమ్మ ఆనందంగా అంటున్నారు.

ఇంటికే వచ్చి ఆరోగ్య సేవలు



ఈమె పేరు కొల్లాబత్తుల ప్రేమావతి, పోడూరు మండలం వేడంగిపాలెం గ్రామం. ప్రమాదవశాత్తు ఈమె కాలు విరిగిపోగా ఆరోగ్యశ్రీలో పాలకొల్లులో శస్త్రచికిత్స చేయించగా ఇంటి వద్దనే ఉంటున్నారు. వైద్య పరీక్షల కోసం ఆస్పత్రికి వెళ్లాల్సిన పనిలేకుండా ప్రభుత్వ వైద్యులే ఈమె వద్దకు వచ్చి పరీక్షలు చేసి మందులిస్తున్నారు. గతంలో ఎన్నడూ ఇలాంటి పరిస్థితి చూడలేదని, ఆరోగ్యం బాగోలేక ప్రభుత్వాస్పత్రికి వెళితే సరిగా వైద్యులే ఉండేవారు కాదని, ఇప్పుడు ఏకంగా ఇంటికే వచ్చి వైద్యసేవలు అందించడం చాలా ఆనందంగా ఉందని ఆమె అంటున్నారు.

ప్రజారోగ్యానికి పట్టం

- వైద్య చరిత్రలో సరికొత్త ఒరవడి
- ఫ్యామిలీ ఫిజీషియన్ విధానం
- గ్రామీణులకు చేరువైన వైద్యం
- ఏడాదిలో 4.86 లక్షల ఓపీ నమోదు
- రోజూ 33 విలేజ్ హెల్త్ క్లినిక్స్ సందర్శన
- అందుబాటులో 14 రకాల వైద్య పరీక్షలు, 105 రకాల మందులు





పోడూరు మండలం గుమ్ములూరులో ఇంటి వద్ద రోగిని పరీక్షిస్తున్న దృశ్యం, వేడంగిపాలెంలో ఇంటికే వచ్చి వైద్య సేవలు అందిస్తున్న వైద్యులు, సిబ్బంది

సాక్షి, భీమవరం: ప్రజారోగ్యమే పరమావధిగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. వైద్య చరిత్రలో సరికొత్త ఒరవడికి శ్రీకారం చుట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ విధానం గ్రామీణ ప్రజలకు వరంలా మారింది. మండల కేంద్రాలు, పట్టణాలకు వెళ్లాల్సిన పని లేకుండా నాణ్యమైన వైద్యం పేదింటి తలుపు తడుతోంది. గర్భిణులు, బాలింతలు, బీపీ, షుగర్, కేన్సర్ ఇతర దీర్ఘకాల వ్యాధులతో బాధపడుతున్న వారికి క్రమం తప్పకుండా వైద్యం అందిస్తూ వారి ఆరోగ్య పరిరక్షణకు దోహదపడుతోంది.

గతం.. అవస్థలమయం : గతంలో వైద్యం కోసం గ్రామీణ ప్రాంత ప్రజలు మండల కేంద్రాల్లోని పీహెచ్‌సీలు, పట్టణాలకు వెళ్లేందుకు తీవ్ర వ్యయప్రయాసలకు గురికావాల్సి వచ్చేది. వైద్యులు, సిబ్బంది, మందుల కొరతతో అక్కడ సేవలు అంతంతమాత్రంగానే ఉండేవి. ఆర్థికస్థోమత లేక రక్తపరీక్షల కోసం ప్రైవేట్ ల్యాబ్‌లను ఆశ్రయించేందుకు పేదలు ఇబ్బంది పడేవారు.

366 విలేజ్ హెల్త్ క్లినిక్‌ల పరిధిలో..

జిల్లాలోని 20 మండలాల్లోని 41 పీహెచ్‌సీల పరిధిలో 366 విలేజ్ హెల్త్ క్లినిక్ (వీహెచ్‌సీ)ల ద్వారా ఫ్యామిలీ డాక్టర్ వైద్యసేవలు అందిస్తున్నారు. 33 సంచార వాహనాల ద్వారా రోజూ 33 వీహెచ్‌సీల పరిధిలో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. పీహెచ్‌సీలోని ఇద్దరు వైద్యులలో ఒకరు తమ మండలంలోని వీహెచ్‌సీలను ప్రతి నెలా క్రమం తప్పకుండా సందర్శిస్తున్నారు. నలుగురు రిజర్వు వైద్యులతో కలిపి 84 మంది వైద్య నిపుణులు, వారి వెంట ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, ఇతర ఆరోగ్య సిబ్బంది విధుల్లో పాల్గొంటున్నారు. ప్రజలకు జవాబుదారీ కోసం ఆ వీహెచ్‌సీలో ఏ తేదీన వైద్యసేవలు అందించేది నోటీసు బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. ఆ రోజు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వీహెచ్‌సీ వద్ద వైద్య శిబిరం ఏర్పాటుచేసి వైద్యసేవలు అందిస్తున్నారు. మధ్యాహ్నం నుంచి ఇళ్ల వద్ద మంచానికే పరిమితమైన రోగుల చెంతకు వెళ్లి చూస్తున్నారు. 14 రకాల వైద్య పరీక్షలతో పాటు 105 రకాల మందులు అందుబాటులో ఉంచి రోగికి అవసరమైన మందులు అందజేస్తున్నారు. ఏడాదిగా ఆయా వీహెచ్‌సీల వద్ద మొత్తం 4,86,911 జనరల్ ఓపీ నమోదైంది. ప్రతి నెలా రోగి పరిస్థితిని గమనిస్తూ క్రమం తప్పకుండా వైద్యం అందించడం ద్వారా ఆరోగ్యవంతమైన జీవనం సాగించేందుకు వీలు కలిగిందని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వాస్పత్రులు.. మారిన రూపురేఖలు

పేదల వైద్యానికి పెద్దపీట వేసిన సీఎం జగన్ నాడు-నేడు ద్వారా ప్రభుత్వ ఆస్పత్రుల రూపురేఖలు మార్చడంతో పాటు వైద్యులు, ల్యాబ్ టెక్నీషియన్స్, ఇతర సిబ్బంది ఖాళీ పోస్టులను భర్తీ చేశారు. విలేజ్ క్లినిక్‌ల ద్వారా గ్రామీణులకు నాణ్యమైన వైద్యాన్ని చేరువ చేశారు. సంపన్నుల మాదిరి పేదలకు ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని అందుబాటులోకి తెచ్చారు. గ్రామాల్లో సర్వే నిర్వహించి గర్భిణులు, బాలింతలతో పాటు బీపీ, షుగర్, టీబీ, ఎనీమా, ఓరల్ కేన్సర్, బ్రెస్ట్ కేన్సర్, సర్వేకల్ కేన్సర్ మొదలైన దీర్ఘకాల వ్యాధులతో బాధపడుతున్న వారిని గుర్తించి వారికి ప్రతినెలా క్రమం తప్పకుండా వైద్యసేవలు అందిస్తుండటం గమనార్హం.

ఆస్పత్రికి వెళ్లే పనిలేదు



నేను ఐదు నెలలుగా షుగర్, బీపీ సమస్యలతో బాధపడుతున్నా. ప్రతి 15 రోజులకోసారి మా ఊరు సచివాలయం వద్దకే డాక్టర్లు, ఇతర సిబ్బంది వచ్చి పరీక్షలు చేసి మందులు ఇస్తున్నారు. దీని వలన ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లే అవసరం ఉండటం లేదు. ఈ విధానం బాగుంది.

\- బందీ పెద్దిరాజు, తణుకు

సరిపడా మందులు



ఐదేళ్ల నుంచి షుగర్ వ్యాధితో బాధపడుతున్నాను. గ్రామంలోని సచివాలయం వద్దకు ప్రతి నెలా రెండుసార్లు ప్రభుత్వ వైద్యులు వచ్చి పరీక్షలు చేసి సరిపడా మందులను ఉచితంగా అందిస్తున్నారు. ఈ వైద్య సేవలను మా కుటుంబంలో ఇద్దరం పొందుతున్నాం.

\- బచ్చుల రమణ, తేతలి

గడప ముంగిటకే..



నాకు షుగర్ ఉంది. రెండు వారాలకు ఒకసారి వైద్యులు మా ఇంటికే వచ్చి పరీక్షలు చేస్తున్నారు. రెండు వారాలకు సరిపడా మందులు ఇస్తున్నారు. గతంలో మేమే ఆస్పత్రుల చుట్టూ తిరిగేవాళ్లం. ఇప్పుడు ఆ అవస్థలు తప్పాయి. గడప ముంగిటకే వైద్య సేవలు అందడం ఆనందంగా ఉంది.

\- పోలాకి లక్ష్మి, చెరుకుమిల్లి

‘స్వీప్’ కార్యక్రమాలు ముమ్మరం చేయాలి

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా



ఏలూరులో ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా

ఏలూరు(మెట్రో): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఓటర్లను చైతన్యపరిచేందుకు స్వీప్ కార్యక్రమాలను ముమ్మరం చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా అన్నారు. ఏలూరు జిల్లాలో ఎన్నికల నిర్వహణ సన్నద్ధతను పరిశీలించేందుకు శుక్రవారం ఆయన ఇక్కడ పర్యటించారు. ముందుగా కలెక్టరేట్‌లోని మీడియా కంట్రోల్ రూమ్‌ను సందర్శించారు. కోడ్ అమలు, ప్రతికూల వార్తల నమోదు, వాటి పరిష్కార తీరు తదితర అంశాలపై ఆరా తీశారు. అలాగే సోషల్ మీడియాలో వచ్చే అంశాలపై ఎలా వ్యవహరిస్తున్నారనే విషయాలు అడిగి తెలుసుకున్నారు. సీ-విజిల్ పర్యవేక్షక, నివేదికలు పంపే విభాగాన్ని ఆయన పరిశీలించారు. ఎన్నికల సన్నద్ధత ఏర్పాట్లను కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్, ఎస్పీ డి.మేరీ ప్రశాంతి ఆయనకు వివరించారు.

‘స్వీప్’పై సంతృప్తి: జిల్లాలో చేపట్టిన స్వీప్ కార్యక్రమాలపై ఏర్పాటుచేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను సీఈఓ ముఖేష్‌కుమార్ మీనా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమాలను మరింత ముమ్మరం చేయాలని ఆదేశించారు. జిల్లాలో పోలింగ్ శాతం పెంచేలా, ఎథికల్ ఓటింగ్ జరపాలని 40 రోజులుగా 1,756 కార్యక్రమాలను చేపట్టినట్టు కలెక్టర్ ఆయనకు వివరించారు. ‘అమ్మ పిలుస్తుంది’ అనే ప్రత్యేక కార్యక్రమం ద్వారా దూరప్రాంతంలో ఉన్న ఓటర్లకు జిల్లా యంత్రాంగం నుంచి ఆహ్వాన పత్రిక పంపి పోలింగ్ రోజు ఓటర్లను పిలిపించి ఓటింగ్‌లో భాగస్వామ్యం చేస్తున్నట్టు డీపీఓ శ్రీనివాస విశ్వనాథ్ చెప్పగా ఆహ్వాన పత్రికతో పాటు ఓటర్ల స్లిప్స్ కూడా పంపించమని ఆయన సూచించారు. జేసీ బి.లావణ్య వేణి, ఐటీడీఏ పీఓ ఎం.సూర్యతేజ, అసిస్టెంట్ కలెక్టర్ టి.పూజ, డీఆర్ఓ డి.పుష్పమణి, ఆర్డీఓలు ఖాజావలి, వై.భవానీ శంకరి, ఎస్డీసీ ఎం.ముక్కంటి తదితరులు ఆయన వెంట ఉన్నారు.

ఏలూరులో నేడు న్యాయమూర్తుల సదస్సు

ఏలూరు (టూటౌన్): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిధిలోని న్యాయమూర్తుల సదస్సును శనివారం ఉదయం నిర్వహిస్తున్నట్టు జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. న్యాయమూర్తులతో నిర్వహించే కాన్ఫరెన్స్, వర్క్‌షాప్‌నకు రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి బి.కృష్ణమోహన్ హాజరుకానున్నట్టు పేర్కొన్నారు. శనివారం ఏలూరు కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో ఉదయం 10 గంటలకు సదస్సు ప్రారంభమవుతుందని తెలిపారు.

శిలువ మోసి.. విశ్వాసం చాటి..



పాలకొల్లులో శిలువ మోస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల గోపి

పాలకొల్లు అర్బన్: సర్వమానవాళి పాప విముక్తి కోసం ప్రభువైన క్రీస్తు శిలువ వేయబడ్డారని వైఎస్సార్‌సీపీ పాలకొల్లు అభ్యర్థి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) అన్నారు. శుక్రవారం గుడ్‌ఫ్రైడ్ సందర్భంగా యాళ్లవానిగరువు ఆర్‌సీఎం చర్చి ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొని పట్టణంలోని రామయ్యహాలు నుంచి యడ్లబజారు వరకు శిలువ మోలువ మోశారు. పట్టణంలోని 27వ వార్డు గరువులో క్రీస్తు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన గుడ్‌ఫ్రైడే ప్రార్థనల్లో పాల్గొన్నారు.

పెత్తందారీ పోకడలతో మదమెక్కిన చంద్రబాబు

మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



తణుకు అర్బన్: ప్రతిపక్ష నేత చంద్రబాబు పెత్తందారీతనంతో మదమెక్కి కొట్టుకుంటున్నారని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు విమర్శించారు. చంద్రబాబు బహిరంగంగా ఒక టిప్పర్ డ్రైవర్‌కి ఎమ్మెల్యే సీటు ఇచ్చారని వైఎస్సార్‌సీపీ శింగనమల ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.వీరాంజనేయులను హేళన చేసి మాట్లాడటంపై మంత్రి కారుమూరి ఫైర్ అయ్యారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భారత రాజ్యాంగం ఇచ్చిన హక్కుల ప్రకారం సాధారణ వ్యక్తులను సైతం అసెంబ్లీకి పంపించాలనే ఉద్దేశంతో దళిత వర్గానికి చెందిన వ్యక్తికి ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం ఇస్తే చంద్రబాబు అతడిని ఒక టిప్పర్ డ్రైవర్‌కు ఎమ్మెల్యే సీటు ఇస్తారా అంటూ హేళన చేయడం ఏంటని నిలదీశారు. అంతేకాకుండా వేలిముద్ర వేసే వాళ్లను పెట్టారంటూ హేళన చేస్తున్న చంద్రబాబు ముఖాన దళిత వర్గాలు ఉమ్మేసే రోజులు దగ్గరపడ్డాయని మండిపడ్డారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో బీసీలను తోకలు కత్తిరిస్తానని, ఎస్సీల్లో ఎవరైనా పుట్టాలనుకుంటారా అని హేళన చేశారని ఇప్పుడు తాజాగా ఒక దళితుడిని ఉద్దేశించి టిప్పర్ డ్రైవర్‌కి సీటు ఇస్తారా అని బహిరంగ సభలో అతని ఆత్మాభిమానాన్ని దెబ్బతీసే విధంగా మాట్లాడటం దుర్మార్గమన్నారు. చంద్రబాబు మాదిరిగా కోట్లాది రూపాయలకు టికెట్లు అమ్ముకునే పరిస్థితి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి లేదు కాబట్టే సామాన్యులను అసెంబ్లీకి పంపించాలనే సంకల్పంతో ఉన్నారని అన్నారు. దళితులు, బీసీలను టార్గెట్ చేసి రాజకీయ పబ్బం గడిపే చంద్రబాబుది ఒక బతుకేనా అని ప్రశ్నించారు. తక్షణమే దళిత వర్గాలకు చంద్రబాబు బహిరంగ క్షమాపణ చెప్పాలని మంత్రి కారుమూరి డిమాండ్ చేశారు.

క్లుప్తంగా

కాలువలోకి దూసుకెళ్లిన ఆటో



పాలకొల్లు సెంట్రల్: రోడ్డుపై వెళుతున్న ఆటోలోకి అకస్మాత్తుగా పాము దూరడంతో కంగారులో ఆ ఆటో పక్కనే ఉన్న కాలువలో పడిపోయింది. స్థానిక పెంకుళ్లపాడు టిడ్కో గృహాల వద్ద ఉంటున్న శ్రీనుబాబు అనే ఆటో డ్రైవర్ శుక్రవారం మధ్యాహ్నం భోజనం సమయంలో ఇంటికి వెళ్తున్నాడు. ఆ మార్గంలో ఓ పాము రోడ్డు దాటుతూ ఆటోలోకి దూరింది. ఆ కంగారులో శ్రీనుబాబు ఆటోలో నుంచి రోడ్డుపైకి దూకేయడంతో ఆటో అదుపుతప్పి పక్కనే ఉన్న కాలువలో పడిపోయింది. ఓ క్రేన్ సహాయంతో ఆటోను కాలువలోనుంచి బయటకు తీసుకువచ్చారు. ఈ సంఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ముసునూరు: అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న నాలుగు ట్రాక్టర్లను పట్టుకుని ముసునూరు పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై పి.వాసు తెలిపారు. బలివేలోని తమ్మిలేరు ఇసుక ర్యాంపు నుంచి గురువారం రాత్రి అనుమతి లేకుండా ట్రాక్టర్లలో ఇసుక లోడ్ చేసి, తరలిస్తున్న బలివేకు చెందిన గుండుబోయిన నాగేంద్రరావు, పిల్లి దుర్గాప్రసాద్, దిమ్మెట శ్రీనివాసరావు, జెట్టి శ్రీనివాసరావులను అదుపులోకి తీసుకుని, ట్రాక్టర్లను రెవెన్యూ కార్యాలయానికి తరలించామన్నారు. తహసీల్దార్ జవహర్ బాజి ఒక్కొక్క ట్రాక్టర్‌కు రూ.5,000 చొప్పున జరిమానా విధించినట్లు తెలిపారు.

కొవ్వలిలో బాస్కెట్‌బాల్ పోటీలు

ఏలూరు రూరల్: ఏప్రిల్ ఆఖరి వారంలో దెందులూరు నియోజకవర్గం కొవ్వలి జెడ్పీ పాఠశాలలో రాష్ట్ర స్థాయి జూనియర్స్ బాస్కెట్‌బాల్ పోటీలు నిర్వహించనున్నామని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి గవ్వ శ్రీను చెప్పారు. ఏలూరులోని కస్తూర్బా బాలికల పాఠశాలలో ఏలూరు బాస్కెట్‌బాల్ అసోసియేషన్ సభ్యుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్ల ఎంపిక త్వరలో చేపడతామన్నారు. నాలుగురోజుల పాటు జరిగే పోటీలు విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అసోసియేషన్ కోశాధికారి కె.మురళీకృష్ణ మాట్లాడుతూ పోటీల నిర్వహణ కోసం దాతల సహకారం తీసుకోవాలన్నారు. గత ఏడాది ఏలూరు నుంచి పలువురు బాలబాలికలు జాతీయస్థాయి పోటీల్లో రాణించారని కొనియాడారు.

ఎన్నికల్లో అక్రమాలపై బ్రహ్మాస్త్రం

సీ విజిల్

ఫిర్యాదు చేసిన 100 నిమిషాల్లోపు చర్యలు



ఏలూరు(మెట్రో) : ఎన్నికల్లో అక్రమాలు నిరోధానికి ప్రజలు పాలనా యంత్రాంగాన్ని అప్రమత్తం చేసేందుకు ఈసీ రూపొందించిన యాప్ సి-విజిల్.. ఈ యాప్‌లో సాయంతో మన చుట్టుపక్కలా ఎన్నికల నియామావళి ఉల్లంఘనలు సులువుగా అధికారుల దృష్టికి తీసుకెళ్లవచ్చు. ఫిర్యాదు చేసిన 100 నిమిషాల్లో అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. ఇంతవరకు ఏలూరు జిల్లాలో సీ విజిల్ ద్వారా అందిన 77 ఫిర్యాదులు పరిష్కరించారు.

జీపీఎస్ సాయంతో వెంటనే లోకేషన్‌కు

సీ విజల్‌ను గూగుల్ ప్లే స్టోర్ లేదా సీవిజిల్ డాట్ ఈఐసీ డాట్ జీవోవీ డాట్ ఇన్ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఎన్నికల్లో జరుగుతున్న అక్రమాలను ఆండ్రాయిడ్ ఫోన్‌లో రికార్డు చేసి సీ విజిల్ యాప్ ద్వారా పంపాలి. కచ్చితమైన ప్రాంతం గుర్తించేందుకు ఇందులో జీఐఎస్, జీపీఎస్ విధానం ఉంటుంది. సి-విజిల్ ద్వారా పంపిన సమాచారం ఈసీఐ, సీఈఓ, డీఈఓ, జిల్లా కంట్రోల్ సెల్‌కు చేరగానే క్షేత్రస్థాయి ఎంసీసీ బృందాలను అప్రమత్తం చేస్తారు. ఆ ప్రదేశానికి క్షేత్ర స్థాయి బృందాలు కచ్చితంగా చేరుకోవడానికి నావిగేషన్ సౌకర్యం ఉంటుంది. ఇప్పటికే స్టోర్ చేసిన మెసేజ్‌లు, గతంలో తీసిన వీడియోలు, ఫొటోలు వంటివి పంపే అవకాశం లేదు. గ్యాలరీ, మెమోరీ నుంచి పంపించే అవకాశం లేదు. స్మార్ట్ ఫోన్ నుంచి తీసిన ఫొటోలు, వీడియోలు అదే స్మార్ట్ ఫోన్ నుంచి 5 నిమిషాల్లో సీ విజిల్ యాప్‌లో పంపాలి.

ఆధారాలతో ఫిర్యాదు చేసే అవకాశం

ఫిర్యాదుదారు పంపిన ఫిర్యాదు రిజిస్టర్ కావాలని కోరుకుంటే వారికో ఐడీ నంబరు ఇస్తారు. చిరునామా ఇవ్వని వారు చేసే ఫిర్యాదులకు ఐడీ నంబర్ ఉండదు. సీ విజిల్ వినియోగించే వారు ఎంసీసీ లేదా వ్యయానికి సంబంధించిన సమాచారమే పంపాలి. డబ్బులు, మద్యం, ఇతర వస్తువుల పంపిణీ, ఎంసీసీ ఫిర్యాదులు పంపడానికి సీ-విజిల్ వేగవంతమైన విధానం. ఈ యాప్ ద్వారా ఆధారాలతో సహా ఫిర్యాదు చేసే అవకాశం ఉంటుంది.

ఎలా ఫిర్యాదు చేయాలంటే..

అక్రమాలు జరుగుతున్న సన్నివేశాలను ఫొటో లేదా వీడియో తీయాలి. లొకేషన్ ఆన్ చేస్తే జీపీఎస్ యాక్టివేట్ అవుతుంది. ప్రయాణిస్తూ ఫొటోలు, వీడియోలు తీయడం వల్ల సరైన ప్రదేశం రాదు. భవనాల లోపల, చెట్ల కింద తీయకూడదు. ఫొటో లేదా వీడియో తీయగానే తేదీ, సమయం రికార్డవుతాయి. ఫొటో లేదా వీడియో తీయగానే స్క్రీన్ మీద ప్రివ్యూ కనిపిస్తుంది. ఏం తీశామన్న దానిని ఒకసారి చూసి నిర్ధారించుకోవాలి. అది ఏ రకమైన అక్రమం అనేదాని కోసం డ్రాప్‌లిస్ట్ చూడాలి. ఏ రకమైన అక్రమం అనేది క్లుప్తంగా రాయాలి. అప్‌లోడ్ చేసిన సమాచారం గురించి స్క్రీన్ మీద కన్ఫర్మేషన్ అడుగుతుంది. ఒకసారి పరిశీలించుకుని కన్ఫర్మ్ చేస్తే అది ఫార్వర్డ్ అవుతుంది. ఫార్వర్డ్ కాగానే సబ్మిట్ చేస్తే సక్సెస్ అని వస్తుంది. పంపిన ఫిర్యాదు ఏ దశలో ఉందో తెలుసుకునేందుకు మెనూలోకి వెళ్లి స్టేటస్ ఆప్షన్ ద్వారా తెలుసుకోవచ్చు.

ఫిర్యాదు చేయాల్సిన అంశాలు

- డబ్బు పంపిణీ, కూపన్ల పంపిణీ.. కొందరు కూపన్లు ఇచ్చి డబ్బులు, వస్తువులు తెచ్చుకోవాలంటారు.
- మద్యం పంపిణీ
- అనుమతిలేని పోస్టర్లు, బ్యానర్ల పంపిణీ
- పెయిడ్ న్యూస్
- భయపెట్టడం, ప్రలోభపెట్టడం
- కాన్వాయ్‌లో అనుమతి కన్నా ఎక్కువ వాహనాలు వెళ్లడం
- ప్రభుత్వ భవనాలు, స్థలాల్లో ప్రచార సామగ్రి ఉంచి ప్రచారం చేయడం, స్లోగన్లు రాయడం, ఓటర్లను రవాణా చేయడం
- పోలింగ్ కేంద్రానికి 200 మీటర్ల లోపు ప్రచారం చేయడం
- ప్రచారంలో మతాన్ని ఉపయోగించడం
- ఓటింగ్‌కు 48 గంటలలోపు ప్రచారం చేయడం, రాత్రి 10 గంటల తరువాత, ఉదయం 6 గంటలకు ముందు లౌడ్ స్పీకర్లు ఉపయోగించడం వంటివి ఫిర్యాదు చేయాలి.

జయప్రకాష్‌ది రెండు నాల్కల ధోరణి

మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు



పాలకొల్లు అర్బన్: లోక్‌సత్తా నేత జయప్రకాష్ నారాయణది రెండు నాల్కల ధోరణి అని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు, జిల్లా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు చీకటిమిల్లి మంగరాజు మండిపడ్డారు. పాలకొల్లు మాలమహానాడు కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే పేదలకు ఉపయోగపడే ఇంగ్లీషు మీడియంతో పాటు, సంక్షేమ పథకాలు నిలిచిపోయి మళ్లీ జన్మభూమి కమిటీలు పెత్తనం చేస్తాయని వ్యాఖ్యానించిన జేపీ తాజాగా ఎన్డీఏ కూటమికి మద్దతు పలుకుతున్నారన్నారు. చంద్రబాబు వద్ద పవన్ కల్యాణ్, షర్మిల, మంద కృష్ణ మాదిగ ప్యాకేజీ తీసుకున్న మాదిరిగానే జేపీ కూడా ప్యాకేజీ తీసుకున్నారని అనుమానాలు కలుగుతున్నాయన్నారు. గత ఐదేళ్ల నుంచి అభివృద్ధి, సంక్షేమం కోసం పాటుపడుతున్న వ్యక్తి సీఎం జగన్ ఒక్కరే అన్నారు. జేపీ కమ్మ కులం కాబట్టి చంద్రబాబుకు మద్దతిస్తున్నట్లుందని మంగరాజు విమర్శించారు. ఎన్ని పార్టీలు కలిసొచ్చినా జగన్ ప్రభంజనాన్ని ఆపలేరన్నారు.

పడాలపై ప్రత్యేక శ్రద్ధ



పడాలలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: పడాలపై తాను మొదటి నుంచి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నానని డిప్యూటీ సీఎం, తాడేపల్లిగూడెం అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కొట్టు సత్యనారాయణ అన్నారు. పడాల గ్రామంలో శుక్రవారం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాను రాజకీయాల్లోకి వచ్చే నాటికి పడాల గ్రామానికి సరైన రహదారి కూడా లేదన్నారు. మొదటిసారి ఎమ్మెల్యేకాగానే రూ.80 లక్షలు వెచ్చించి ప్రధాన రహదారి నుంచి పడాలకు రోడ్డు నిర్మించామన్నారు. గ్రామ ప్రజలు చెరువులో నీరు తాగే వారని, తాను మొదటిసారిగా గోదావరి జలాలను గ్రామానికి తీసుకువచ్చి ఇంటింటికి మంచినీరు సరఫరా చేశామన్నారు. నేడు అసాంఘిక శక్తులన్నీ ఏకమవుతున్నాయని ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలన్నారు, రౌడీలు , గూండాలు, సెటిల్‌మెంట్ గ్యాంగులు, పేకాట రాయుళ్లు వంటి సంఘ విద్రోహులందరూ ఒకే గూటికి చేరుతున్నారని హెచ్చరించారు. తనపై పోటీ చేస్తున్న అభ్యర్థి గతంలో మున్సిపల్ చైర్మన్‌గా చేసి ఐదేళ్లలో చేసింది ఏమైనా ఉందా అని ప్రశ్నించారు. తప్పుడు రాజకీయాలతో అభివృద్ధిని అడ్డుకోవడం తప్ప చేసింది ఏమీ లేదని విమర్శించారు. పార్టీలకతీతంగా తమ ప్రభుత్వం అర్హులందరికి సంక్షేమ పథకాలు అందించిందన్నారు. అందరూ సమష్టిగా పార్టీ విజయం కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు. రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి ఎంపీగా గూడూరి ఉమాబాలను, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని మంత్రి కొట్టు సత్యనారాయణ విజ్ఞప్తి చేశారు. సమావేంలో ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్ కుమార్, సీనియర్ నాయకులు తమ్మిశెట్టి ఆదినారాయణ (చుక్కయ్య)లు మాట్లాడారు. మండల పార్టీ ప్రెసిడెంట్ జడ్డు హరిబాబు, జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, ఆరుగొలను సొసైటీ చైర్మన్ చిక్కాల సత్యనారాయణ, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బొడ్డు సాయిబాబా, పడాల మాజీ సర్పంచ్ పులి గోపాలకృష్ణ, కామిశెట్టి వినోద్, పులి ప్రసాద్ (బుజ్జి) బొద్దాని శ్రీనివాస్, కళింగ కార్పొరేషన్ స్టేట్ డైరక్టర్ సంపతరావు కృష్ణారావు, వైఎస్ఆర్‌సీపీ నాయకులు కొట్టు విశాల్, తదితరులు పాల్గొన్నారు.

రసవత్తరంగా బాస్కెట్‌బాల్ పోటీలు



ఇండియన్ నేవీ, ఇండియన్ ఆర్మీ జట్ల మధ్య సాగుతున్న బాస్కెట్‌బాల్ మ్యాచ్

నూజివీడు: పట్టణంలోని డీఏఆర్ కళాశాల ఆవరణలో నిర్వహిస్తోన్న బొబ్బిలి కొండలరావు మెమోరియల్ జాతీయ స్థాయి పురుషుల బాస్కెట్‌బాల్ పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. సూపర్‌లీగ్ పద్ధతిలో ఫ్లడ్‌లైట్ల వెలుగులో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో పాల్గొన్న జట్లు విజయం కోసం హోరాహోరీగా పోరాడుతున్నాయి. జాతీయ స్థాయి జట్లు టోర్నమెంట్‌లో ఆడుతుండటంతో బాస్కెట్‌బాల్ క్రీడాభిమానులు ఆటను చూసేందుకు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. శుక్రవారం నిర్వహించిన మ్యాచ్‌ల్లో ఇండియన్ బ్యాంక్ జట్టు కేఎస్ఈబీ కేరళ జట్టుపై 65–49 స్కోర్‌తో, ఇండియన్ నేవీ జట్టు జైన్ యూనివర్సిటీ జట్టుపై 66–54 స్కోర్‌తో, ఇండియన్ ఆర్మీ జట్టు ఏపీ జట్టుపై 78–34 స్కోర్‌తో, ఇండియన్ బ్యాంక్ జట్టు ఏపీ జట్టుపై 93–52 స్కోర్‌తో, కేరళ జట్టు ఏపీ జట్టుపై 102–60 స్కోర్‌తో విజయం సాధించాయి. బాస్కెట్‌బాల్ పోటీలు ఈ నెల 31 వరకు నిర్వహించనున్నారు. టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ తిరుమలశెట్టి వెంకట కృష్ణారావు పర్యవేక్షించగా సిద్ధార్థ కాలేజీ, త్రివిధ, కుమార్ స్కూళ్ల ప్రిన్సిపాల్‌లు గొల్లపల్లి రవిబాబు, సబ్బినేని శ్రీనివాస్, పిన్నమనేని వెంకట కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ రామిశెట్టి మురళీకృష్ణలు క్రీడాకారుల్ని పరిచయం చేసుకున్నారు.

రేపు ‘తిరుమల’లో అవగాహన సదస్సు

రాజమహేంద్రవరం రూరల్: పదో తరగతి పూర్తిచేసిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు జేఈఈ(మెయిన్స్), జేఈఈ(అడ్వాన్స్‌డ్), నీట్ వంటి జాతీయ పరీక్షలపై ఆదివారం ఉదయం 10 గంటలకు రాజమహేంద్రవరం కాతేరులోని తిరుమల విద్యాసంస్థల ప్రాంగణంలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నాట్లు తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు ఓ ప్రకటనలో తెలిపారు. సదస్సుకు హాజరుకావాలనుకునే విద్యార్థులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.తిరుమలఈడీయూ.కామ్‌లో తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. నిపుణులైన అధ్యాపకులు సలహాలు, సూచనలు తెలియజేస్తారని, వివరాలకు 7997071672 నెంబరులో సంప్రదించాలని తిరుమలరావు కోరారు.

సారా తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

పోలవరం రూరల్: నాటు సారా తరలిస్తున్న ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్ తెలిపారు. పోలవరం మండలం మెత్తాపుకోట గ్రామానికి చెందిన మిడియం రాంబాబు మోటార్‌సైకిల్‌పై 160 లీటర్ల సారా తరలిస్తుండగా పట్టుబడినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచామన్నారు.

తనిఖీల్లో భారీగా నగదు పట్టివేత

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఎన్నికల అధికారులు, టాస్క్‌ఫోర్స్ బృందాలు నిర్వహించిన తనిఖీల్లో శుక్రవారం పెద్ద ఎత్తున నగదు పట్టుకున్నారు. తగిన ఆధారాలు చూపించని నగదును సీజ్ చేశారు. రూ. 50 వేల కంటే ఎక్కువ నగదు తీసుకువెళ్తే తప్పకుండా ఆధారాలు దగ్గరుంచుకోవాలని అధికారులు పేర్కొన్నారు.

నూజివీడులో రూ.5.32 లక్షల సీజ్

నూజివీడు : పట్టణంలోని మైలవరం రోడ్డు ట్రిపుల్‌ఐటీ సమీపంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద శుక్రవారం పోలీసులు భారీ నగదును పట్టుకున్నారు. సీఐ ఎంవీవీఎస్ఎన్ మూర్తి ఆధ్వర్యంలో వాహనాల తనిఖీల్లో భాగంగా కృష్ణా మిల్క్ యూనియన్‌కు చెందిన వాహనం తనిఖీ చేయగా అందులో ఉన్న సిబ్బంది వద్ద రూ.5.32 లక్షల నగదును గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.

రూ.6,14,700 నగదు పట్టివేత

గణపవరం : గణపవరం మండలం సరిపల్లె శివారున శుక్రవారం ఉదయం ప్రత్యేక తనిఖీ బృందం చేసిన తనిఖీల్లో రూ.6.14 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సుభాష్ తెలిపారు. భీమవరం నుంచి గణపవరం వైపు వస్తున్న రెండు కార్లను తనిఖీ చేయగా ఇళ్ల రవీంద్రనాథ్ దగ్గర రూ.1,14,700 నగదు, వేగేశ్న కాశీ వెంకటసుబ్బరాజు దగ్గర రూ. 5 లక్షల నగదు మొత్తం రూ. 6,14,700 గుర్తించామని, దీనికి సంబంధించి, ఎలాంటి రసీదులు, ఆధారాలు లేనందున నిబంధనల మేరకు ఆ మొత్తాన్ని సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు. ఇంతవరకూ నిడమర్రు పోలీస్ సర్కిల్ పరిధిలో రూ.16,62,600 నగదు సీజ్‌చేసి జిల్లా ట్రెజరీకి స్వాధీనం చేశామన్నారు.



నూజివీడులో నగదును స్వాధీనం చేసుకున్న పట్టణ పోలీసులు



గణపవరంలో స్వాధీనం చేసుకున్న నగదుతో సీఐ సుభాష్, తనిఖీ బృందం సభ్యులు

రూ.లక్ష స్వాధీనం

భీమడోలు : భీమడోలులో ఫ్లయింగ్ సర్వేలెన్స్ బృందం ఆధ్వర్యంలో గుండుగొలను వద్ద వాహనాలను తనిఖీ చేశారు. కారులో రూ.లక్ష నగదును తరలిస్తుండగా గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. తణుకు చెందిన టి.పరమేశ్వరరావు రూ.లక్ష నగదును విజయవాడ తీసుకెళ్తున్నారు.

సంక్షేమం కోసం జగన్‌ను గెలిపించుకోవాలి

ఎన్నికల ప్రచారంలో మంత్రి కారుమూరి



తణుకులో ఎన్నికల ప్రచారంలో మంత్రి కారుమూరి, ఎమ్మెల్సీ రవీంద్రనాథ్

తణుకు అర్బన్: ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ గెలిపించుకుంటేనే సంక్షేమం పారదర్శకంగా అందుతుందనే విషయం ప్రజలే చెబుతున్నారని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు కొమ్మాయిచెర్వు గట్టు ప్రాంతంలో శుక్రవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. కోడి కూయకముందే పింఛను అందాలన్నా, పేదింటి పిల్లలు ఉన్నత విద్య చదువుకోవాలన్నా, పేదోడికి ఖరీదైన వైద్యం ఉచితంగా అందాలన్నా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాల్సి ఉందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజల గుండెల్లో నిలిచిపోయారని, సంక్షేమం కోసం జగన్‌కు అండగా నిలబడేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. చంద్రబాబుకు అవకాశం ఇస్తే మళ్లీ జన్మభూమి కమిటీలతో ప్రజలను దోపిడీ చేస్తారంటూ ప్రజలు బహిరంగంగానే విమర్శిస్తున్నారని అన్నారు. ఏ పార్టీ అని చూడకుండా అందించిన సంక్షేమం కారణంగా ఆయా పార్టీల సానుభూతిపరులు జగన్‌కు ఓటేసేందుకు సిద్ధం అంటున్నారని అన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుపై వేయాలని, మొదటి ఫ్యాన్ గుర్తు ఓటు నరసాపురం ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాలకు రెండో ఫ్యాన్ గుర్తు తనకు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా గడపగడపకు తిరిగి ఫ్యాన్ గుర్తుకు ఓటేయాల్సిందిగా మంత్రి ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్, ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు వీరమల్లు ఫణీంద్రకుమార్, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు చేశెట్టి లలితా శంకర్, ఉపాధ్యక్షుడు కారుమంచి యోహాన్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలనను ప్రజలు ఆశీర్వదించాలి

ఎంపీ శ్రీధర్, వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు సునీల్, విజయరాజు



లక్కవరంలో ఎన్నికల ప్రచారంలో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు సునీల్ కుమార్, విజయరాజు, చిత్రంలో ఎంపీ శ్రీధర్‌బాబు

జంగారెడ్డిగూడెం రూరల్: సంక్షేమ పాలనను మరోసారి ఆశీర్వదించాలని, మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి చేసుకోవడంతో పాటు, ఏలూరు ఎంపీగా సునీల్ కుమార్‌ని, చింతలపూడి ఎమ్మెల్యేగా విజయరాజును గెలిపించుకోవాలని ఎంపీ కోటగిరి శ్రీధర్‌బాబు అన్నారు. జంగారెడ్డిగూడెం మండలం లక్కవరంలో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎంపీ కోటగిరి శ్రీధర్‌బాబు, ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్, చింతలపూడి ఎమ్మెల్యే అభ్యర్థి కంభం విజయరాజు పర్యటించారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులకు వీరికి ఘన స్వాగతం పలికారు. ఎంపీ కోటగిరి పార్టీ శ్రేణులతో కాలినడక గ్రామంలో పర్యటించి అభ్యర్థులను గెలిపించాలని అభ్యర్థించారు. ఎంపీ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలననలో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగిందని, ఆయనను మరోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కారుమూరి సునీల్ కుమార్ మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి దిశగా ముఖ్యమంత్రి పరిపాలన చేశారన్నారు. కంభం విజయరాజు మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వం నవరత్నాల పథకాలను చేరువ చేసిందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గెల్లా వెంకట రమణ, ఎంపీపీ కొదమ జ్యోతి, జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వామిశెట్టి హరిబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు జెట్టి గురునాథరావు, బీవీఆర్ చౌదరి, గోరుముచ్చు గోపాల యాదవ్, ఎంపీటీసీ దల్లి మోహన్‌రెడ్డి, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు నిమ్మ గురునాథరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు దల్లి నాగేశ్వరరావు, నాయకులు వందనపు సూర్యప్రకాశరావు, రాఘవరాజు ఆదివిష్ణు, గురజాల పార్థసారథి, మళ్ళీడి బాబి, ముప్పిడి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్యే లక్ష్యం

ఉండ్రాజవరం: క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్యను అందించడమే తమ లక్ష్యమని శశి విద్యాసంస్థల చైర్మన్ బూరుగుపల్లి రవికుమార్ అన్నారు. మండలంలో వేలివెన్ను శశి క్యాంపస్‌లో జాతీయ విద్యావిధానం, సీబీఎస్ఈ కోర్సుపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. జాతీయ విద్యా విధానంలో అనేక మార్పులు జరిగాయని దానికి అనుగుణంగా శశి వేలివెన్ను క్యాంపస్‌లో విద్యా ప్రణాళికలో మార్పులు చేశామని, సీబీఎస్ఈతో విద్యార్థులు జాతీయ స్థాయి పరీక్షల (ఐఐటీ, ఎన్ఐటీ, నీట్)లో రాణిస్తున్నారన్నారు. అకడమిక్ డైరెక్టర్ చిట్టూరి శేషుబాబు మాట్లాడుతూ 10వ తరగతి తరువాత విద్యార్థి దశ చాలా కీలకమైనదన్నారు. మరో అకడమిక్ డైరెక్టర్ మన్నె వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 44 సంవత్సరాల అనుభవం ఉన్న అధ్యాపక బృందంతో అద్భుత ఫలితాలు సాధిస్తున్నామన్నారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తుడు శుక్రవారం రూ.1,00,116 లను విరాళంగా అందజేశారు. విజయవాడకు చెందిన భీమన శ్రీనివాసరావు ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని నిత్యాన్నదాన కార్యాలయంలో జమ చేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ సూపరింటెండెంట్ రాజు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

క్లుప్తంగా

పోలీసుల కవాతు



కడకట్లలో పోలీసుల కవాతు

తాడేపల్లిగూడెం : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రజలకు విశ్వాసం కలిగించడానికి పోలీసులు శుక్రవారం కడకట్లలో కవాతు నిర్వహించారు. ప్రశాంతమైన, స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకొనేలా ప్రజలకు భరోసా ఇచ్చేందుకు పట్టణ సీఐ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో కేంద్ర భద్రతా బలగాలతో కలిసి కవాతు చేశారు. కడకట్లతో పాటు హౌసింగ్‌బోర్డు కాలనీలో ఇది జరిగింది.

శాశ్వత నిత్యాన్నదానానికి రూ.1,11,116 విరాళం

భీమవరం(ప్రకాశం చౌక్): స్థానిక శ్రీ మావుళ్లమ్మ సన్నిధిలో జరుగుతున్న శాశ్వత నిత్యాన్నదానానికి శుక్రవారం చినఅమిరం చెందిన కె. వెంకట సుబ్బరాజు శ్రీ దేవి దంపతులు రూ.1,11,116 విరాళంగా అందించారు. ముందుగా దాతలతో ఆలయ అర్చకులు కొప్పేశ్వర రావు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం ,అమ్మవారి చిత్రపటం అందజేశారు. కార్యక్రమంలో బుద్ధా మహాలక్ష్మి నగేష్, బాబురావు పాల్గొన్నారు.

మోటారు సైకిల్ అపహరణ

భీమవరం: స్థానిక టౌన్ రైల్వేస్టేషన్ సమీపంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రి వద్ద పార్క్‌చేసిన మోటారు సైకిల్ దొంగిలించారని పి.ఏడుకొండలు ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసినట్లు టుటౌన్ ఎస్సై జీజే ప్రసాద్ చెప్పారు. గురువారం సాయంత్రం మోటారు సైకిల్ ఆసుపత్రి వద్ద రోడ్డుపై పార్క్ చేసి ఆసుపత్రి లోకి వెళ్లి వచ్చే సరికి గుర్తుతెలియన వ్యక్తి దొంగిలించాడు. దీంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు.

వైభవంగా దానమ్మ విగ్రహ పునఃప్రతిష్ఠ



ఎస్.ఇల్లిందలపర్రులో దానమ్మ ఆలయం

పెనుమంట్ర: మండలంలోని సోమరాజు ఇల్లిందలపర్రు గ్రామంలో నూతనంగా నిర్మించిన దానమ్మ వారి ఆలయ విగ్రహ పునః ప్రతిష్ఠా కార్యక్రమం గ్రామానికి చెందిన ప్రముఖ దాత వెలగల నవభారత్ రెడ్డి, వాణి దంపతుల ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి వైదిక కార్యక్రమాలను నిర్వహించిన అనంతరం విగ్రహ ప్రతిష్ఠ, శిఖర ప్రతిష్ఠ కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు చెరుకువాడ శ్రీరంగనాథరాజు వైఎస్సార్ సీపీ నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి గూడూరి ఉమాబాల, మండప ప్రదిక్షణ చేసి దానమ్మ వారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ఆవరణలో పెద్ద ఎత్తున అఖండ అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్మాణ ప్రధాన దాత వెలగల శివాజీరెడ్డి దంపతులు, ఎంపీపీ కర్రి వెంకట నారాయణరెడ్డి దంపతులు, సర్పంచ్ వనుం సూర్యనారాయణ, ఉపసర్పంచ్ గొలుగూరి నాగిరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు కొవ్వూరి సూర్యభాస్కరరెడ్డి, కొవ్వూరి వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా సంకటహర చతుర్థి పూజలు

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో సంకటహర చతుర్థి సందర్భంగా లక్ష్మీగణపతి హోమం జరిపించారు. శుక్రవారం ఆలయంలో భమిడపాటి వెంకన్న బ్రహ్మత్వంలో 15 మంది దంపతులు హోమంలో పాల్గొన్నారు. హోమం అనంతరం భక్తులకు స్వామివారి శేష వస్త్రం, ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కోరాడ శ్రీనివాసరావు, ఈఓ యాళ్ల సూర్యనారాయణ పాల్గొన్నారు.

నేడు అరట్లకట్టలో గుడాల గోపి ప్రచారం

పాలకొల్లు అర్బన్: మండలంలోని అరట్లకట్టలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) శనివారం ఉదయం 8గంటల నుంచి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని పార్టీ మండల కన్వీనర్ విప్పర్తి ప్రభాకరరావు తెలిపారు. ప్రచార కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

నేడు, రేపు అలంపురంలో కంటి పరీక్షలు

పెంటపాడు: అలంపురం వెంకటరమణ చారిటీ ఆసుపత్రిలో ఈనెల 30, 31 తేదీల్లో కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తామని ట్రస్టు ప్రతినిధి కొలనువాడ పెదకృష్ణంరాజు ఒక ప్రకటనలో తెలిపారు. నిడదవోలు రాజేశ్వరి లయన్స్ కంటి వైద్యులు పరీక్షలు చేసి అవసరమైన వారికి శస్త్రచికిత్సలు చేసి, ఉచితంగా కళ్లజోళ్లు అందించనున్నట్టు పేర్కొన్నారు. పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పేదలను అణగదొక్కేందుకు వస్తున్న పెత్తందార్ల కూటమి

- వైఎస్సార్ సీపీ శ్రేణులంతా అప్రమత్తంగా ఉండాలి
- తణుకులో కార్యకర్తల సమావేశంలో మంత్రి కారుమూరి



తణుకులో కరపత్రాలు ఆవిష్కరించిన మంత్రి కారుమూరి, ఎమ్మెల్సీ రవీంద్రనాథ్ తదితరులు



కంతేరులో ప్రచార వాహనం నుంచి అభివాదం చేస్తున్న మంత్రి కారుమూరి

తణుకు అర్బన్ : పేదలను అణగదొక్కేందుకు పెత్తందార్లు కూటమి రూపంలో వస్తున్నారని వారి బారినుంచి ప్రజలను కాపాడుకునేందుకు వైఎస్సార్ సీపీ శ్రేణులంతా సిద్ధంగా ఉండాలని రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు అన్నారు. తణుకు 10, 14 వార్డులకు సంబంధించి శుక్రవారం స్థానిక కొమ్మాయి చెర్వు ప్రాంతంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు అందాల్సిన వనరులను కార్పొరేట్ ముసుగులో ఉండే పెత్తందార్లకు దోచిపెట్టేందుకు ప్రతిపక్షాలు కూటమి రూపంలో వస్తున్నారని దుయ్యబట్టారు. ప్రజలకు సంక్షేమంఅందించి ప్రతి కుటుంబాన్ని అభివృద్ధి బాటలో నడిపించాలనే దృఢనిశ్చయంతో ఉన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలంతా అండగా ఉన్నారని ఆయన అన్నారు. కార్యకర్తలంతా ఒకటికి రెండుసార్లు ప్రతి గడపకూ వెళ్లి ప్రజలకు అందుతున్న సంక్షేమంతోపాటు వారికి ఏమైనా ఇబ్బందులుంటే తొలగించే దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. రెండు నెలలపాటు కార్యకర్తలంతా కష్టపడితే మరలా 5 ఏళ్ల కాలం ప్రజలకు మంచి చేసే అవకాశం మనందరికీ దక్కుతుందని అన్నారు.

ధైర్యంగా ఓట్లు అడిగే హక్కు సీఎం జగన్‌కే ఉంది

ఇరగవరం: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను 99 శాతం నెరవేర్చి మళ్లీ ధైర్యంగా ఓట్లు అడిగే హక్కు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీకి మాత్రమే ఉందని రాష్ట్ర పౌరసరఫరాల, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు చెప్పారు. శుక్రవారం ఇరగవరం మండలంలోని అయినపర్రు, ఓగిడి, కాకిలేరు, పొదలాడ, కంతేరు, కొత్తపాడులో నాయకులతో ఆత్మీయ సమావేశం, సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మంత్రి కారుమూరి మాట్లాడుతూ ప్రస్తుతం ఏ గ్రామానికి వెళ్లి చూసినా అభివృద్ధిలో పెద్ద ఎత్తున మార్పు కనిపిస్తుంది. గ్రామాల్లో గత పాలనలో గ్రామాల్లో అభివృద్ధి అంతంత మాత్రంగానే ఉండేది అదే ఇప్పుడు ప్రతి గ్రామంలో సచివాలయం, రైతు భరోసా కేంద్ర, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, అంగన్‌వాడీ భవనాలు, నాడు–నేడులో పాఠశాలల అభివృద్ధితో గ్రామాలు కళకళలాడుతున్నాయని తెలిపారు. సంక్షేమం అభివృద్ధిని రెండు కళ్లుగా రాష్ట్రన్ని మందుకు తీసుకెళ్లిన ఘనతం సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసి అన్ని సేవలు గడప వద్దకు చేరవేస్తూ, ఇంటికి పెద్ద కొడుకులా సీఎం జగన్ ఉన్నారన్నారు. మహిళలకు డ్వాక్రా రుణ మాఫీ, ఇంటి పట్టా వారి పేరు మీద రిజిస్ట్రేషన్ చేసి వారికి ఆర్థిక భరోసా కలిగించారు. రాష్ట్రంలో పేదరికాన్ని తగ్గించి ప్రజల్లో కొనుగోలు శక్తిని పెంచి రాష్ట్ర ప్రజలను ఆర్థికంగా బలోపేతం చేశారన్నారు. గ్రామాల్లో ఆయన దృష్టికి వచ్చిన సమస్యలు వెంటనే పరిష్కరిస్తామన్నారు. రానున్న ఎన్నికల్లో కూటమి పేరుతో మూడు పార్టీల కండువాతో వచ్చి ప్రజలను మోసం చేసే నాయకులను నమ్మ వద్దు అని అన్నారు. వారికి ఓటు వేస్తే అభివృద్ధి, సంక్షేమానికి అడ్డుకట్ట వేసినట్లే అని పేర్కొన్నారు. మీ కోసం ఎన్నో బటన్ నొక్కిన సీఎం జగన్ కోసం రెండు బటన్లు నొక్కి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా గూడూరి ఉమాబాలను గెలిపించాలని కోరారు. రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి జగన్‌ను బలపర్చాలని కోరారు. దానికి మేమంతా సిద్ధం అంటూ ప్రజలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు మెంబర్ మేకా శేషుబాబు, సొసైటీ అధ్యక్షుడు సత్తి సత్తిబాబు, పెన్మెత్స రామభద్ర రాజు, డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, ఏపీపీ వెలగల సాయిబాబా రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గాప్రసాద్, సత్తి వెంకటరెడ్డి, చోడే జోషి, జవ్వాది సురేష్, అప్పారావు, గుడిమెట్ల సత్యనారాయణ రెడ్డి సర్పంచ్ గుడిమెట్ల అదిలక్ష్మి, సర్పంచ్‌లు, పెచ్చేటి పెద స్వామి, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ప్రజలకు అండగా నిలవాలి

స్థానికంగా ఏ సమస్య వచ్చినా మీకు మేము అండగా ఉంటామనే ధైర్యాన్ని వార్డు నాయకులు, కార్యకర్తలు ప్రజలకు ఇవ్వాలని ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్ఫూర్తితో ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. పార్టీకోసం ప్రతి కార్యకర్త సైనికుడిగా పనిచేయాలని, వైఎస్సార్ సీపీకి అధికారం వస్తే ప్రజలకు మంచి జరుగుతుందనే విషయాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. ఈ సందర్భంగా ఎన్నికల కరపత్రాన్ని మంత్రి కారుమూరి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, వైద్యవిభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ దాట్ల సుందరరామరాజు, దున్నాల ఉమామహేశ్వరరావు, కోన రమేష్, కౌతారు రామాంజనేయులు, మలకలపల్లి సత్యనారాయణ, మూర్తి, మల్లుల లక్ష్మీనారాయణ, వీరమల్లు ఫణీంద్రకుమార్, మెహర్ అన్సారీ, నూకల కనకదర్గు, లలితా శంకర్, కారుమంచి యోహాన్, సామంతుల అప్పారావు, కుడుపూడి చంద్రరావు, కారుమంచి మిత్ర, తాటిపర్తి వాసు, జిలాని, కొమ్మోజు రామకృష్ణ, అనపర్తి జయరాజు పాల్గొన్నారు.

క్రీస్తు శిలువ త్యాగం.. మానవాళికి మోక్షం



పెంటపాడు : గూడెంలో ఆర్సీఎం చర్చిల ఆధ్వర్యంలో శిలువ ర్యాలీ



తణుకు టౌన్: గుడ్ ఫ్రైడే సందర్భంగా దువ్వ రక్షణ సైన్యం చర్చిలో ప్రార్థనలు



అత్తిలిలో గుడ్‌ఫ్రైడే సందర్భంగా శిలువ మోస్తూ క్రీస్తు గీతాలను ఆలపిస్తున్న విశ్వాసులు

పెంటపాడు: గుడ్‌ఫ్రైడేను తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. క్రీస్తు శిలువ మరణం, శ్రమలు, త్యాగాలను వివరించారు. గూడెం టౌన్ ఎ.క్లాష్ ప్యారిష్ చర్చిలో సంఘ కాపరి ఫీనెహాస్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు శిలువ మరణం మానవాళికి మోక్షమన్నారు. ఏసు క్రీస్తు పాపులకోసం ఉద్భవించిన కరుణామయుడని తెలిపారు. ఆయన సూచించిన శాంతి, కరుణ, సహనాలతో క్రైస్తవులు నడవాలని సూచించారు. కాకినాడ క్రైస్తవ కళాశాల ఉపన్యాసకులు రంజిత్ కుమార్ ఏసు శిలువలో పలికిన ఏడు మాటల సారాన్ని వివరించారు. ముదునూరుపాడు బైబిలు మిషను చర్చిలో మిషన్ ఉపాధ్యక్షుడు అద్దంకి దైవారావు, గూడెం ఎల్ఎల్ఎం చర్చిలో సంఘ వ్యవస్థాపకులు, పాస్టర్ల సంఘ నాయకులు మల్లిపూడి జైబాబు, కొండాయి చెరువు వద్ద ఫెయిత్ చర్చిలో రాష్ట్ర పాస్టర్ల సంఘ నాయకులు, జీజే జ్యోతి ఆనంద్, టీచర్స్ కాలనీలోని జీజెస్ బిలీవర్ యూనియన్ ఆధ్వర్యంలో మానుకొండ డల్లా, చినతాడేపల్లి షేకెనా ప్రార్థనా మందిరంలో పరిమి సుగుణరావు, ప్రత్తిపాడు, పాతూరు, పెదతాడేపల్లి ప్రాంతాల్లోని ఆర్సీఎం, మదర్‌వన్నిని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఫాదర్ జోసఫ్ అర్జున్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా గూడెం ప్రాంతంలో శిలువతో ఊరేగింపు నిర్వహించారు. పోలీస్ ఐలాండ్, కడకట్ల, బస్టాండ్ సెంటర్, గొల్లగూడెం, హౌసింగ్ బోర్డు ప్రాంతాల్లో ర్యాలీలు నిర్వహించారు. మదర్ వన్నిని నర్సింగ్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. క్రీస్తు శిలువ శ్రమ దినాలు పురస్కరించుకొని 40 రోజులు దీక్షను భక్తులు ముగించారు.

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే ప్రార్థనలు

తణుకు టౌన్: ఏసు క్రీస్తును శిలువ వేసిన రోజును గుర్తు చేసుకుంటూ గుడ్ ఫ్రైడే సందర్భంగా తణుకు మండలంలోని వివిధ గ్రామాల్లోని చర్చిల్లో క్రైస్తవులు ఉపవాస ప్రార్థనలు నిర్వహించారు. శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ పలు చర్చిల్లో క్రైస్తవులు ప్రార్థనల్లో పాల్గొన్నారు. వేల్పూరులోని సెయింట్ పాల్స్ చర్చి, దువ్వలోని రక్షణ సైన్యం చర్చి, తణుకులోని ఆర్‌సీఎం చర్చి, జీడీఎం, లూథరన్ చర్చిల్లో గుడ్ ఫ్రైడే ప్రార్థనలు నిర్వహించారు. వేల్పూరు సెయింట్‌పాల్స్ చర్చిలో పాస్టర్ ఎం బుచ్చిబాబు ఆధ్వర్యంలో ఆరాధనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎల్‌సీసీ, పీసీసీ సభ్యులు, సండే స్కూల్ విద్యార్థులు, విశ్వాసులు పాల్గొన్నారు. దువ్వ రక్షణ సైన్యం చర్చిలో పాస్టర్ పాస్టర్ జయానందం, లతా జోషి, సంఘ పెద్దలు అశోక్, కోటి, వెంకట్, వరదానం, గృహ సమితి స్త్రీలు, యూత్ సభ్యులు పాల్గొన్నారు. ఆర్‌సీఎం చర్చిల్లో పాస్టర్లు, సంఘ పెద్దలు, విశ్వాసులు పాల్గొన్నారు.

అత్తిలిలో..

అత్తిలి: అత్తిలి ఎంఎం పాఠశాల వద్ద ఫాదర్ జయరాజు ఆధ్వర్యంలో గుడ్‌ఫ్రైడేను శుక్రవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పాస్టర్లు పాల్గొని క్రీస్తు శిలువను మోస్తూ క్రీస్తు గీతాలను ఆలపిస్తూ ఊరేగారు. అత్తిలి శివారు మరనాత గార్డెన్‌లో గుడ్‌ఫ్రైడే వేడుకలు నిర్వహించారు. చర్చి నిర్వాహకుడు ఏ.జాన్సన్ రాజాజ్యోతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో విశ్వాసులు పాల్గొన్నారు.

బీసీలంతా వైఎస్సార్ సీపీ వెంటే



పెద అమిరంలో పీవీఎల్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందిస్తున్న నౌడు

కాళ్ల: నియోజకవర్గంలో బీసీలంతా వైఎస్సార్ సీపీ, ఉండి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్ నర్సింహరాజు వెంట ఉన్నారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి నౌడు వెంకటరమణ స్పష్టం చేశారు. కాళ్ల మండలం పెదఅమిరం గ్రామంలోని పార్టీ కార్యాలయంలో పీవీఎల్‌ను నౌడు వెంకటరమణ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా నౌడు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో బీసీ సంఘాల తరపున విస్తృత ప్రచారం చేసి పీవీఎల్ నర్సింహరాజును అత్యధిక మెజారిటీతో గెలిపించుకుంటామన్నారు. బీసీలకు పెద్దపీట వేసిన వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వెంటే బీసీలంతా ఉంటారని ధీమా వ్యక్తం చేశారు. వైఎస్ జగన్ మళ్లీ అధికారంలోకి వస్తేనే ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైఎస్సార్ సీపీ బీసీ సెల్ సంయుక్త కార్యదర్శి బాలం సత్యనారయణ, జిల్లా బీసీ సంఘ అధ్యక్షులు సూరవరపు వెంకటాచార్యులు, జిల్లా బీసీ సెల్ కార్యదర్శి గంటా సత్యనారాయణ, ఆకివీడు జెడ్పీటీసీ సభ్యులు వేగేశ్న వెంకటరాజు, రాజేష్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పీవీఎల్‌ను సత్కరించిన ముస్లిం పెద్దలు

ఆకివీడు: పవిత్ర రంజాన్ మాసం ముస్లింలకు అత్యంత ప్రీతిపాత్రమైందని, పెద్ద పండుగగా భావిస్తుంటారని, ఆధ్యాత్మికతకు రంజాన్ పెట్టింది పేరు అని వైఎస్సార్ సీపీ ఉండి అసెంబ్లీ అభ్యర్థి పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. స్థానిక దుంపగడప రోడ్డులోని చిన్న మసీదు వద్ద వైఎస్సార్ సీపీ నాయకుడు ఎస్కే సుభానీ రంజాన్ విందును శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన్ని ముస్లిం పెద్దలు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పీవీఎల్ మాట్లాడుతూ ముస్లింలు వైఎస్సార్ సీపీకి అండగా ఉన్నారని చెప్పారు. సీఎం జగన్ కూడా ముస్లింలకు అధిక ప్రాధాన్యతనిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ముస్లిం పెద్దలు ఎండీ మదనీ, మస్తాన్ వలీ, సుఫీ ఖాదరీ, బాషిద్, మిజామ్ బాబా, ఎస్కే సుభానీ, హుస్సేన్, ఎండీ.అలీ, షరీఫ్, వసీమ్, మునీర్ పాల్గొన్నారు.

జగన్ పాలనలో సంతోషంగా క్రైస్తవులు



చెరుకువాడ సమావేశంలో పాల్గొన్న కొర్రపాటి అనిత, ఏఐసీఎఫ్, వైఎస్సార్ సీపీ నాయకులు

ఉండి: ఎన్నికల సమయం దగ్గర పడుతున్న కొద్దీ ఓట్లు అడగడానికి మోసగాళ్లు వస్తున్నారని, క్రైస్తవులంతా జాగ్రత్తగా ఉండాలని రాష్ట్ర క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ కొర్రపాటి అనిత అన్నారు. శుక్రవారం మండలంలోని చెరుకువాడలో అనిత ఆధ్వర్యంలో ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ (ఏఐసీఎఫ్), వైఎస్సార్ సీపీ నాయకులు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ అనిత, ఏఐసీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బొబ్బనపల్లి సుందర్‌దాస్, యండగండి సర్పంచ్ గోగులమండ చినకృష్ణమూర్తి, వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు జీ సుందర్‌కుమార్, వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు వెలగపల్లి టోనీ తదితరులు మాట్లాడుతూ గత కొద్ది రోజుల నుంచి క్రైస్తవ సంఘ నాయకులు అని చెప్పుకుంటున్న టీడీపీకి చెందిన వారు వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనారిటీ సెల్, క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ వంటి సంస్థలపై ఇష్టానుసారం నోరు పారేసుకుంటున్నారని అన్నారు. అటువంటి వారిని గుర్తించి దూరంగా ఉండాలన్నారు. రాష్ట్రంలో వీధి వీధికి క్రైస్తవులపై దాడులు జరుగుతున్నాయని చెప్పడం వారి నీచబుద్ధికి నిదర్శనమన్నారు. రాష్ట్రంలో ఎక్కడా క్రైస్తవులపై దాడులు జరగడం లేదని, ఒకవేళ ఎక్కడైనా జరిగితే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధతో దోషులకు శిక్షపడేలా చేస్తున్నారని అన్నారు. వైఎస్ జగన్ పాలనలో క్రైస్తవులంతా సుఖసంతోషాలతో జీవిస్తున్నారని అన్నారు. క్రైస్తవులకు ప్రత్యేక స్థానం కల్పించిన జగన్‌మోహన్‌రెడ్డికి క్రైస్తవ లోకం రుణపడి ఉంటుందన్నారు. రాజకీయంగా, సామాజికంగా ముందుకు నడిపిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెనుకనే తామంతా ఉంటామన్నారు. ఏఐసీఎఫ్ జిల్లా కో–ఆర్డినేటర్ పీతల రాజు, ఆకుల బిల్‌మోరియా, బొడ్డు వీరాస్వామి, ముడితి జోసఫ్, జంగంపల్లి తాతయ్య, దొల్లా సంపతరావు, కంకిపాటి తాతయ్య, కంకిపాటి విజయ్, డొల్లా యోసేబు, కొర్రపాటి మేరీలీలారత్నకుమారి పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీకి మద్దతుగా బీసీ సంఘాల ప్రచారం



భీమవరంలో ఉమాబాలను కలిసి పుష్పగుచ్ఛం అందిస్తున్న వెంకటరమణ తదితరులు

భీమవరం: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థుల విజయానికి బీసీ సంఘాల తరుపున విస్తృతంగా ప్రచారం చేస్తామని వైఎస్సార్ సీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నౌండ్రు వెంకటరమణ అన్నారు. భీమవరం నరసాపురం పార్లమెంట్ వైఎస్సార్ సీపీ అభ్యర్థిని గూడూరు ఉమాబాలను క్యాంపు కార్యాలయంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసిన సందర్భంగా మాట్లాడారు. నరసాపురం ఎంపీగా ఉమాబాలను అత్యధిక మెజారిటీతో గెలిపించుకుంటామన్నారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలే వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను విజయపథంలో నడిపిస్తాయని వెంకటరమణ స్పష్టం చేశారు. ముందుగా ఉమాబాలకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ బీసీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బాలం సత్యనారాయణ, జిల్లా బీసీ సంఘ అధ్యక్షుడు, సూరవరపు వెంకటాచార్యులు, గంటా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రహదారి నిర్మించారని సర్పంచ్‌కు సత్కారం



సర్పంచ్ సత్యనారాయణను సత్కరిస్తున్న పెద్దలు

కాళ్ల: ఎన్నో ఏళ్లుగా నోచుకోని రహదారి నిర్మాణం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సాధ్యమైందని బొండాడ పేట గ్రామవాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. బొండాడపేట గ్రామంలో 200 మీటర్ల మేర రహదారిని గ్రామ సర్పంచ్ గోళ్ళ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఇటీవల నిర్మించారు. ప్రధానంగా ఈ దారికి ఇరువైపులా పద్మశాలీలు నివాసం ఉంటున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలోనే రహదారి నిర్మాణం జరిగిందని, దీంతో రహదారి సమస్య తీరిందని స్థానికులు, పెద్దలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా విజయగణపతి దేవస్థానంలో సర్పంచ్ గోళ్ళ సత్యనారాయణను ఆ ప్రాంత పద్మశాలీలు శుక్రవారం ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఆకురాతి ఉమామహేశ్వరావు, ఆకురాతి వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ గుత్తికొండ భూషయ్య తదితరులు సర్పంచ్ సత్యనారాయణను సన్మానించి బంగారు ఉంగరాన్ని ఉంగరాన్ని బహుకరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలతో పాటు స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

నేడు పెద్దింట్లమ్మ ఆలయ ప్రతిష్ఠ మహోత్సవం



పెనుగొండ మల్లప్ప దిబ్బలోని పెద్దింట్లమ్మ ఆలయం

పెనుగొండ: స్థానిక మల్లప్పదిబ్బలోని పెద్దింట్లమ్మ ఆలయం పునఃప్రతిష్ఠ మహోత్సవం శనివారం నిర్వహించనున్నారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలోని పురాతన పెద్దింట్ల మ్మ ఆలయం రహదారి విస్తరణతో ఆలయం రోడ్డు దిగువకు ఉండడంతో ఇబ్బందులు పడేవారు. వర్షం పడితే చాలు వర్షపు నీరు అంతా ఆలయంలోకి చేరుకునేది. దీంతో ఎన్నో ఏళ్లుగా నూతన ఆలయ నిర్మాణానికి విజ్ఞప్తి చేసినా గత ప్రభుత్వం పట్టించుకోలేదు. సమస్యను మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు దృష్టికి తీసుకు వెళ్లడంతో ప్రభుత్వం నుంచి రూ.80 లక్షల నిధులు మంజూరు చేయించారు. దీంతో నిర్మాణం పూర్తి చేశారు. శనివారం విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించడానికి సన్నాహాలు పూర్తి చేశారు. ప్రభుత్వ నిధులకు తోడు, దాతల సహకారం తోడు కావడంతో ఆలయాన్ని పూర్తి హంగులతో తీర్చిదిద్దారు. ఆలయాభివృద్ధికి కృషి చేసిన మాజీ మంత్రి శ్రీరంగనాథరాజుకు పలువురు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

గరువురజకపేట రోడ్డుకు మోక్షం



గరువు రజకపేటకు రూ. 28లక్షలతో నిర్మించిన గోస్తనీగట్టు సీసీ రోడ్డు

పెనుమంట్ర: మండలంలోని గరువు, రజకపేట రోడ్డుకు మోక్షం కలిగింది. గరువు గ్రామ పంచాయతీ పరిధిలోని సాంబయ్య చెరువుగట్టు ప్రాంతంలో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఇళ్ల స్థలాలు ఇచ్చారు. అయితే ఈ కాలనీలలో ప్రధాన రోడ్లుగా ఉన్న గోస్తనీ నది గట్టు రోడ్డు నిర్మాణ విషయంలో ఆ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో 25 ఏళ్లుగా గరువు, రజకపేట రోడ్డు అధ్వానంగా మారింది. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత ఆ కాలనీ వాసులు తమ సమస్యలను స్థానిక శాసన సభ్యుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన స్పందించి ప్రభుత్వ నిధులు రూ.40 లక్షలు మంజూరు చేయించారు. అయితే రూ.20 లక్షలు గరువురజకపేట రోడ్డుకు, రూ.20 లక్షలు జగనన్న కాలనీ రోడ్లకు కేటాయించడంతో ఈ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. గరువు రజకపేట రోడ్డుకు అదనంగా రూ. 8లక్షలు పంచాయతీ నిధులు వెచ్చించింది. దీంతో రూ. 28 లక్షలతో గరువు రజకపేటకు 600 మీటర్లు సీసీ రోడ్డు నిర్మించి రోడ్డు పనులను పూర్తి చేశారు. జగనన్న కాలనీలో కూడా రోడ్డు నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి.

సీఎం జగన్‌తోనే సామాజిక న్యాయం

పాలకొల్లు అర్బన్: రాష్ట్రంలో వెనుకబడిన కులాల వారికి సామాజికంగా గుర్తింపునిచ్చి రాజకీయ పదవులు కట్టబెట్టిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు గూడూరి వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు. పాలకొల్లు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం జగన్ అమలు చేసిన సంస్కరణలతో బీసీలకు సామాజిక న్యాయం, రాజ్యాధికారం, ఆత్మగౌరవం గత 5 ఏళ్లలో దక్కిందన్నారు. త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో బీసీలకు 11 పార్లమెంట్ స్థానాలు, 48 అసెంబ్లీ స్థానాలు ఇచ్చి బీసీ సామాజిక వర్గానికి సీఎం జగన్ పెద్ద పీట వేశారని అభినందించారు.